క్లుప్తంగా

పట్టణ ఆరోగ్య కేంద్రాలు సందర్శన



లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని బుధవారం నగరంలోని కండ్రిక, ప్రకాష్‌నగర్, వాంబేకాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో జరుగుతున్న ఇమ్యునైజేషన్‌ప్రోగ్రామ్‌ను పరిశీలించారు. గర్భిణులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ మహేశ్వరరావు, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ. 2.06 లక్షలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లో వేం చేసిన వీరాంజనేయ స్వామి వారికి భక్తులు హుండీల ద్వారా రూ. 2.06 లక్షల నగదును కానుకలు, మొక్కుబడులుగా సమర్పించారు. దేవస్థాన ఆవరణలో బుధవారం కానుకల లెక్కింపు జరిగింది. ఆలయ చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు, ఈవో రావూరి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కానుకల లెక్కింపు చేపట్టారు. ఏడాది కాలంలో స్వామి వారికి భక్తులు రూ. 2,06,198 నగదును కానుకల రూపంలో సమర్పించారు. ఆలయ ధర్మకర్తలు చలముల శెట్టి జగదీష్, అయితా మాణిక్యాలరావు, పోతిన గాయత్రి, యలమంచలి భవానీ, పువ్వుల తులసీ, గుర్రం బేబి స్వప్న, ఎక్స్ అఫీషియల్ సభ్యులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ ఆలయ అర్చకులు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద తనిఖీలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జిల్లా సరిహద్దుగా ఉన్న ప్రకాశం బ్యారేజీ వద్ద వన్‌టౌన్ పోలీసులు బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో అంతర్ జిల్లా చెక్‌పోస్టును ప్రకాశం బ్యారేజీ వద్ద ఏర్పాటు చేశారు. వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షణలో స్థానిక సీఐ దుర్గాశేఖర్‌రెడ్డి ఇతర అధికారులు బ్యారేజీ వద్ద వాహనాలు ఆపి తనిఖీలు నిర్వహించారు. అక్రమ మద్యం, నగదు తరలింపు అరికట్టేందుకు ఈ తనిఖీలను చేపట్టారు. సీఐ ఇతర అధికారులతో పాటుగా పారా మిలటరీ సిబ్బంది సాయంతో విధులు నిర్వర్తిస్తున్నారు. సీఐ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాలతో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని చెప్పారు.

అత్తింటి వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధిస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఇస్లాంపేటకు చెందిన షేక్.నజ్మల్ సాహెర్‌కు 2020లో హైదరాబాద్‌కు చెందిన షేక్. జాకీర్ హుస్సేన్‌కు ఇచ్చి పెద్దలు వివాహం చేశారు. వివాహ సమయంలో కట్నకానుకలు భారీగానే ఇచ్చారు. వీరికి ఒక ఆడ పిల్ల ఉంది. కొంత కాలంగా మద్యానికి అలవాటు పడిన జాకీర్‌హుస్సేన్ భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. ఆడ పిల్ల పుట్టిందని, పుట్టింటికి వెళ్లి మరింత కట్నం తీసుకురావాలని వేధించారు. దీంతో బాధితురాలు పుట్టింటికి వచ్చేసింది. అత్తింటి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు

పెనమలూరు: బంగారు ఆభరణాలు చోరీ జరిగిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ. రామారావు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరు జగనన్న కాలనీకి చెందిన చేకూరి సాయిదీప్తి కొద్ది రోజుల క్రితం యనమలకుదురులోని ఓ కల్యాణ మండపంలో తన కుమార్తె ఫంక్షన్ చేసింది. ఆ సమయంలో బంగారు ఆభరణాలు దాదాపు 7 తులాల వస్తువులు గదిలో పెట్టి మర్చి పోయింది. కొద్ది సమయం తరువాత వచ్చి చూసుకునే సరికి గదిలో బంగారు ఆభరణాలు కనబడలేదు. గదిలో ఆ సమయంలో మేకప్ చేయటానికి వచ్చిన యువతి ఉందని, పోలీసులు విచారించి తనకు న్యాయం చేయాలని బాధితురాలు సాయిదీప్తి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

టీడీపీ కూటమిని తరిమికొట్టాలి

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అసిఫ్



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఆసిఫ్ ఇతర నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమిని తరిమికొట్టాలని అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పాతబస్తీ సరాయి మసీద్ (ఇందాద్ ఘర్) ఆవరణలో బుధవారం నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమానికి ఆసిఫ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ముస్లింలతో కలిసి ఇఫ్తారు స్వీకరించారు. మసీదు బయట మీడియాతో మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం మానవాళి ఏ విధంగా జీవించాలో నిర్దేశిస్తుందన్నారు. భగవంతుని ఆశీస్సులు పొందటానికి మానవుడు ఏ విధంగా నడుచుకోవాలో ఈ మాసం వివరిస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ముస్లిం వర్గాలకు మేలు చేకూరిందని పేర్కొన్నారు. చంద్రబాబు తన పాలనలో కనీసం ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కూడా లేకపోవటం మైనార్టీ వర్గాల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. ముస్లింల యువకులను దేశద్రోహులుగా చిత్రీకరించి కేసులు పెట్టి జైలుకు పంపిన దుర్మార్గుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు కూటమికి తగిన బుద్ధి చెప్పటానికి ముస్లింలందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మోహిద్దీన్, స్థానిక కార్పొరేటర్. మండేపూడి చటర్జీ, అంజుమన్ సంస్థ కార్యదర్శి బషీరుద్దీన్ నాయకులు అమనుల్లా, బాజీబాబా, జిలాని, సుభాని, జిఎంసి అల్తాఫ్, హుస్సేన్, కటన్ కరీముల్లా, సుభాన్‌ఖాన్, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రతిష్ట



ఆలయ ప్రతిష్టలో షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆంజనేయ వాగు వడ్డెర పేటలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కనకదుర్గ అమ్మవారి దేవస్థాన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ ముఖ్యఅతిథిగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. వడ్డెర సంఘానికి అండగా ఉంటానని పేర్కొన్నారు. స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్‌తో పాటుగా కోటిరెడ్డి, ఇర్ఫాన్ హాజరై పాల్గొన్నారు. సంఘం నాయకులు ఆలకుంట శ్రీనివాసరావు ఇతర కమిటీ ప్రముఖులు కార్యక్రమాలను నిర్వహించారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం..

- కృష్ణమ్మ జల విహారం పార్కుకు సందర్శకుల తాకిడి
- మానసికోల్లాసం కోసం విచ్చేస్తున్న వైనం
- ఒత్తిళ్లను అధిగమించేందుకు దోహదం
- వ్యాయామం కోసం ఓపెన్ జిమ్‌ను ఆశ్రయిస్తున్న ప్రజలు



పార్కులో సందర్శకుల తాకిడి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉరుకులు పరుగుల జీవన విధానంలో సిటీ లైఫ్ గజిబిజి గందరగోళంగా మారింది. విధి నిర్వహణలో, నగరంలోని ట్రాఫిక్‌లో ప్రయాణం ఇలా ప్రతి ఒక్కరూ తీవ్రమైన ఒత్తిళ్లకు గురవుతున్నారు. అలాంటి జీవనం నుంచి బయట పడేందుకు ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు వీకెండ్స్‌లో దూర ప్రాంతాల్లోని ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చని ప్రదేశాల్లో గడిపేవారు. ఇప్పుడు అలాంటి అవసరం లేకుండా, నగరంలోనే నందన వనం లాంటి పార్కు అందుబాటులోకి వచ్చింది. కృష్ణానదీ తీరాన ఏర్పాటు చేసిన కృష్ణమ్మ జలవిహారం పార్కు ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటుంది. వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్, పిల్లల కోసం ఆటపరికరాలు ఏర్పాటు చేశారు. ఒకప్పుడు పార్కుకు వెళ్లాలంటే నగరంలో రాజీవ్‌గాంధీ పార్కు, అంబేడ్కర్ పార్కు వంటి వాటికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు కృష్ణమ్మ నదీ తీరాన ఏర్పాట్లు చేసిన పార్కును ఆశ్రయిస్తున్నారు.

ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు....

ఒకవైపు కృష్ణానది నుంచి వీచే చల్లటి గాలులు, ఆహ్లాదం కలిగించే రకరకాల మొక్కలు పెంచుతున్నారు. ఒకసారి పార్కును సందర్శించిన వారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా తీర్చిదిద్దారు. వాకింగ్, ఓపెన్‌జిమ్‌లో వ్యాయామంతో మానసికోల్లాసం పొందేలా రూపొందించారు. ఇప్పుడు నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో అక్కడికి తరలివస్తున్నారు. వాహనాలు పార్కింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

కుటుంబ సమేతంగా...

నగర జీవికి శారీరక శ్రమ లేక పోవడంతో ఎక్కువుగా జీవనశైలి వ్యాధులకు గురవుతున్నారు. వాటి నుంచి బయట పడేందుకు వ్యాయామంపై దృష్టి సారిస్తున్నారు. ఒకప్పుడు వ్యాయామం చేయాలంటే జిమ్‌కు వెళ్లాల్సి వచ్చేది. లేదంటే వాకింగ్ ట్రాక్ ఉన్న గ్రౌండ్‌కు వెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నగరంలోని అన్ని కాలనీల్లో పార్కులు అందుబాటులోకి వచ్చాయి. వాటికి తోడు ఇప్పుడు కృష్ణమ్మ జల విహారం పార్కు అందరినీ ఆకట్టుకుంటుంది. వాకింగ్ ట్రాక్‌లతో పాటు, ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భార్యాభర్తలతో పాటు, తమ పిల్లలను తీసుకుని పార్కులకు వచ్చి వ్యాయామం చేస్తున్న వారు ఎక్కువుగా ఉంటున్నారు. మరోవైపు వృద్ధులు సైతం మానసికోల్లాసం కోసం పార్కులకు వస్తున్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వం పార్కులను అభివృద్ధి చేసింది.

నగరానికే ఐకాన్‌లా పార్కు



కృష్ణానది ఒడ్డున ఏర్పాటు చేసిన కృష్ణమ్మ జలవిహారం పార్కు అందరినీ ఆకట్టుకుంటుంది. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సందర్శకులు పార్కుకు వస్తున్నారు. రాత్రి వేళల్లో కూడా పార్కులో కాసేపు సేదతీరేందుకు వీలుగా లైటింగ్ ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్, పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఉన్నాయి. ప్రస్తుతం ఇది నగరానికే ఐకాన్‌లో నిలుస్తుంది.

– కసగోని దుర్గారావు, కృష్ణలంక

మానసికంగా చాలా ఉపయోగం



బిజీలైఫ్ నుంచి బయట పడేందుకు వాకింగ్ చాలా అవసరం. పచ్చని మొక్కలు చూస్తూ వాకింగ్ చేయడం వలన మానసిక ఉల్లాసంతో పాటు, మెమరీ పెరుగుతుంది. ఉదయం సాయంత్రం వేళ్లలో పచ్చని మొక్కల మధ్య వాకింగ్‌తో స్వచ్ఛమైన ఆక్సిజన్ బ్రెయిన్‌కు అందుతుంది. నదీ తీరాన ఏర్పాటు చేసిన పార్కు సందర్శనతో మానసికోల్లాసం పొందవచ్చు. ఉదయం వేళ వాకింగ్‌తో విటమిన్ డి లభిస్తుంది. ఎముకల పటుత్వంతో పాటు, హ్యాపీ హార్మోన్ రిలీజ్ అవుతుంది.

–డాక్టర్ గర్రే శంకరరావు, మానసిక విశ్లేషకులు



పిల్లలు ఆడుకుంటున్న దృశ్యం



ఆకట్టుకుంటున్న సింహం రూపం

ఏపీఎస్ఆర్ఎంసీ పాఠశాలను తనిఖీ చేసిన డీసీపీ



కృష్ణలంక(విజయవాడతూర్పు): జిల్లాలోని పదో తరగతి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేశామని డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. నగరంలోని పదో తరగతి పరీక్షలు జరుగుతున్న కృష్ణలంకలోని శ్రీ పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ (ఏపీఎస్ఆర్ ఎంసీ) పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ అధికారులకు, పరీక్షా కేంద్రాల అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 178 పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. సీపీ టీకే రాణా ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఐపీఎస్ స్థాయి అధికారులు పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణలంక పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎ.మురళీకృష్ణ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేత



ఉపకారవేతనాలను అందిస్తున్న డాక్టర్ నారాయణరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు మానవీయతను పెంపొందించుకోవాలని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు అన్నారు. గురుగోవింద్ సింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకరపర్తి భావనారాయణ కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకారవేతనాలను బుధవారం అందించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా నారాయణరావు పాల్గొని విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుగోవింద్ సింగ్ ఫౌండేషన్ ఏటా పేద విద్యార్థులకు అండగా ఉంటుందని చెప్పారు. ఫౌండేషన్ స్ఫూర్తిని అర్థం చేసుకొని సమాజంలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. గురుగోవింద్‌సింగ్ ఫౌండేషన్ చైర్మన్ సర్దారి కులదీప్‌కౌర్ మాట్లాడుతూ సమాజంలో ఉన్నతంగా ఎదగటానికి విద్యార్థులు నిరంతరం శ్రమించాలని కోరారు. విద్య ద్వారా విజ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు. తోటి వ్యక్తులకు సహాయాన్ని అందించటానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రముఖులు హరివిందర్ సింగ్, పరమ్‌జిత్‌సింగ్; హరిజిత్‌కౌర్, రమణీక్‌కౌర్, కరంబీర్‌కౌర్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, అధ్యాపకులు డాక్టర్ కె.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించాలని వినతి



మధురానగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, అఫిలియేటెడ్ డిగ్రీ కళాశాలలకు మే ఒకటో తేదీ నుంచి రెండు నెలలు వేసవి సెలవులు ప్రకటించాలంటూ బుధవారం జీసీజీటీఏ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్, జీసీటీఏ నాయకులు లలితారెడ్డి యూనివర్శిటీ వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్‌లకు వినతి పత్ర అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి వారు విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు జారీ చేసిన అధికారిక అకడమిక్ క్యాలెండర్ ప్రకారం రెండు నెలల వేసవి సెలవులను రాష్ట్రంలోని యూనివర్సిటీలు ప్రకటించాల్సి ఉందని పేర్కొన్నారు. జిల్లాలో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ వంటి పెద్ద కళాశాలలో రీసెర్చ్ సెంటర్లను అవసరమైన సబ్జెక్టులకు ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాముడు, ముప్పా పద్మనాభం, జి. లుముంబా తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రిజిస్ట్రార్ డాక్టర్ కె. శోభన బాబుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కొత్తపేట పరిధిలో పోలీసుల కవాతు



కొత్తపేట వీధుల్లో కేంద్ర పారా మిలటరీ దళాల కవాతు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రజలు సహకరించాలని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం కేంద్ర పారామిలటరీ, సివిల్ పోలీసులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. చిట్టినగర్ సెంటర్ నుంచి ప్రారంభమైన కవాతు కేటీ రోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రహ్మణ వీధి, కోమలవిలాస్, బీఆర్‌పీ రోడ్డు, పంజా సెంటర్, చేపల మార్కెట్ ప్రాంతాల్లో సాగింది. ఈ సందర్భంగా ఏసీపీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకుందామని ప్రజలను ధైర్యం చెబుతూ కవాతు ముందుకు సాగిందన్నారు. వివాదాలకు దూరంగా ఉండటమే కాకుండా సోషల్ మీడియాలో వచ్చే కథనాలను నిజానిజాలు తెలియకుండా మరొకరికి పార్వర్డ్ చేసి ఇబ్బందులకు గురి కావద్దని సూచించారు. స్థానికంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కవాతులో కొత్తపేట సీఐ గణేష్, వన్‌టౌన్, సీఐలు పాల్గొన్నారు.

క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'కలియుగం పట్టణంలో'

ఆ చిత్ర హీరో విశ్వ కార్తికేయ



మాట్లాడుతున్న హీరో విశ్వకార్తికేయ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 29న విడుదల కానున్న కలియుగం పట్టణంలో సినిమా క్రైమ్ థ్రిల్లర్, లవ్, మదర్ సెంటిమెంట్‌తో అందరినీ ఆకట్టుకుంటుందని ఆ చిత్ర హీరో విశ్వకార్తికేయ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో విశ్వ కార్తికేయ మాట్లాడారు. కనకదుర్గమ్మ ఆశీస్సులతో తమ చిత్రం ప్రమోషన్‌ను ప్రారంభించామని తెలిపారు. కళాశాల విద్యార్థులతో చిత్ర విశేషాలు ముచ్చటించినట్లు చెప్పారు. వారి నుంచి వచ్చిన స్పందన ఎంతో సంతోషంగా ఉందన్నారు. బాల నటుడిగా ఎన్నో చిత్రాల్లో నటించానన్నారు. ఎన్నో క్రైమ్ సినిమాలు వచ్చి ఉంటాయని, కానీ వాటన్నింటికీ విభిన్నంగా ఈ సినిమా ఉంటుందన్నారు. ప్రేక్షకులు తప్పక ఆదరించాలన్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు విశేష స్పందన లభించినట్లు పేర్కొన్నారు. కుటుంబ సమేతంగా చిత్రాన్ని వీక్షించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సహ హీరో నరేన్‌రామ్ దర్శకుడు రమణ కాంత్‌రెడ్డి, నిర్మాత మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు మోటార్ల అందజేత



మోటార్లతో నీటిని విడుదల చేస్తున్న రైతులు

అంబాపురం(విజయవాడరూరల్): ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ నైజం. అందులో ఆరు కాలం కష్టపడి పంటలను పండించే రైతులను ఆదుకోవడం అంటే ఆయన ముందుంటారు. ఈ ఏడాది దాళ్వా సీజనులో వరి పండిస్తున్న అంబాపురం, పి.నైనవరం గ్రామాలకు చెందిన రైతులు దాదాపు 758 ఎకరాల్లో వరి పంట సాగుచేస్తున్నారు. వరి పొలాలు పిలక దశలో ఉండగా, ఆ పొలాలకు సాగు నీరు లేక ఎండిపోయే పరిస్థితి నెలకొంది. దిక్కుతోచని రైతులు ఇటీవల ఆ గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, కో కన్వీనర్ తోడేటి బెంజిమెన్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌ను కలిశారు. సహృదయంతో స్పందించిన వంశీమోహన్ వెంటనే తన సొంత నిధులతో ఆరు వంద హెచ్‌పీ సామర్థ్యం గల మోటార్లను రైతులకు అందజేశారు. ఆ మోటార్లను గొల్లపూడి, జక్కంపూడి గ్రామాల సరిహద్దులో ఉన్న బుడమేరు నుంచి నీటిని పొలాలకు వినియోగించుకునే విధంగా మోటార్లు ఏర్పాటు చేశారు. నాయకులు నల్లమోతు చంద్రశేఖర్, తోడేటి బెంజిమెన్‌లు విద్యుత్‌శాఖ అధికారుల సహకారంతో బుధవారం తెల్లవారు జామున మోటార్లను ఆన్ చేసి నీటిని విడుదల చేశారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: తన కుమారుడు అదృశ్యమయ్యాడని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు 100 అడుగుల రోడ్డులో కె.లావణ్య, భర్త నాగరాజు ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటోంది. ఆమె ఇళ్లల్లో పనులు చేస్తోంది. కాగా ఈ నెల 16వ తేదీన ఆమె కుమారుడు కె.సతీష్(15) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో సతీష్ కోసం అన్ని ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

నెమలి(గంపలగూడెం): ఈనెల 23వ తేదీ నుంచి మండలంలోని నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆరు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఏ డీసీపీ కనకరాజు (ఎస్‌బీ), విజయవాడ రూరల్ ఏడీసీపీ బి. పార్థసారథి గ్రామంలో పర్యటించి ఏర్పాట్లపై ఆలయ అధికారులు, పాలకవర్గ సభ్యులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈనెల 25వ తేదీన జరుగనున్న స్వామి కల్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆలయ సహాయ కమిషనర్ ఎన్.వెంకట సాంబశివరావుకు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తాగునీటి సరఫరా, విద్యుద్దీకరణ, పారిశుద్ధ్య చర్యలు తదితర అంశాలపై చర్చించారు. కాగా కనకరాజు, పార్థసారథిలు ఈసందర్భంగా వేణుగోపాల స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు ఆశీర్వదించారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, తిరువూరు సీఐ నబీ, ఎస్ఐ ఎస్ శ్రీను, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యం విక్రయిస్తున్న మహిళను కొత్తపేట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితురాలి నుంచి 12 బీర్ బాటిల్స్, 3 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కొత్తపేట సెక్టార్ ఎస్ఐ రాజనరేంద్ర కొత్తపేట నెహ్రూ బొమ్మ సెంటర్‌లో బుధవారం గస్తీ నిర్వహిస్తున్నారు. పాత కాంగ్రెస్ కార్యాలయం సమీపంలో ఓ మహిళ అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించింది. దీంతో మహిళను అదుపులోకి తీసుకుని విచారించారు. కొండ ప్రాంతానికి చెందిన లోకనాథం లక్ష్మీగా గుర్తించారు. మహిళ వద్ద ఉన్న చేతి సంచిలో మద్యం బాటిల్స్‌ను గుర్తించిన పోలీసులు నిందితురాలిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.